సాక్షి పల్నాడు

శనివారం । 1 । జూలై । 2023



దుర్గమ్మకు బంగారు హారం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దురమ్మకు తాడేపల్లికి చెందిన వింద్యావర్షిణి, సాయి సహస్ర రూ.3.50 లక్షలు పెట్టి 64 గ్రాముల బంగారంతో చేయించిన మామిడి పిందెల హారాన్ని సమర్పించారు.



అమ్మవారికి సారె

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాలలో శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు, భక్త బృందాలు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించాయి.



తిరుపతమ్మకు బోనాలు

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా తిరుపతమ్మను శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

రోత రాతలపై ఆగ్రహం

- ఈనాడు పత్రిక ప్రతుల దహనం
- అవాస్తవాలు రాయడంపై ధ్వజం
- తీరు మార్చుకోకుంటే ఖబడ్దార్ అంటూ హెచ్చరిక
- టీడీపీ కరపత్రం బహిష్కరణకు పిలుపు
- వైఎస్సార్ సీపీ నిరసనలతో హోరెత్తిన మాచర్ల నియోజకవర్గం
- పీఆర్కే నాయకత్వంలోనే పల్నాడు అభివృద్ధి అని ఉద్ఘాటన



మాచర్లలో ఈనాడు పేపర్లను దహనం వైఎస్సార్‌సీపీ నాయకులు



కారంపూడిలో పచ్చ పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మాచర్ల: నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే)ని రాజకీయంగా ఎదుర్కోలేకనే ఈనాడు దినపత్రికలో టీడీపీ నేతలు రోత రాతలు రాయిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ నేతలు మండిపడ్డారు. శుక్రవారం ఈనాడు దినపత్రికలో పీఆర్కే, ఆయన సోదరుడు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిపై బురదచల్లుతూ కథనం ప్రచురించిన నేపథ్యంలో మాచర్ల నియోజకవర్గ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆ పత్రిక ప్రతులను వైఎస్సార్ సీపీ నేతలు దహనం చేశారు. ఈనాడు కుట్రలను ఎండగట్టారు. మాచర్లలో మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కామనబోయిన కోటయ్య, రాష్ట్ర డైరెక్టర్లు ఉప్పల పాటి జాని, పోలూరి నరసింహారావుతోపాటు నాయకులు భారీస్థాయిలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. అవాస్తవాలు రాసే ఈనాడు, రామోజీరావు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈనాడు పత్రికను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

- రెంటచింతలలోని గుంటూరు–మాచర్ల ప్రధాన రహదారిపై వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు పి.సంపూర్ణమ్మ, ఎంపీపీ దాసరి చాడేశ్వరి, బీసీ విభాగం మండల కన్వీనర్ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో రామోజీరావు దిష్టిబొమ్మకు చెప్పులదండ వేసి ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రెంటచింతల సర్పంచ్ పూజల పుష్పావతిరామయ్య, పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోర్తల ఉమ, పార్టీ నేతలు బొద్దూరి బ్రహ్మారెడ్డి, కట్టమూరి నాగేశ్వరరావు, పమ్మి సీతారామిరెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, యేలూరి సత్యం, ఉమ్మా రామాంజనేయరెడ్డి, గుండా కిశోర్, చాంద్, దేగల సంసోన్, ఇగుటూరి మల్లారెడ్డి, కాయితి వెంకటరెడ్డి, పేర్ల లక్ష్మయ్య, బత్తుల దేవ, షేక్ వలి, కామిరెడ్డి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.
- కారంపూడి బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ అభిమానులు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఈనాడు ప్రతులను దహనం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్, జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ జిల్లా కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి తదితరులు ఈనాడు, రామోజీరావు తీరును ఎండగట్టారు.
- వెల్దుర్తి బస్టాండ్ సెంటర్‌లో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈనాడు దినపత్రిక ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, జెడ్పీటీసీ రూప్లీ బాలునాయక్, సర్పంచ్‌లు పిన్నెల్లి వెంకటరెడ్డి, దేరంగుల యేగయ్య, బలిగొడుగుల శ్రీనివాసరావు, పార్ల పల్లి పెద గాలయ్య, తోట శ్రీనివాసరావు, శీలం సైదారెడ్డి, కాయకోకుల రామాంజి, రవీంద్రనాయక్, శ్రీనునాయక్, ఎంపీటీసీ ఈగల అయ్యన్న పాల్గొన్నారు.
- దుర్గి ప్రధాన రహదారిపై ఈనాడు పత్రిక ప్రతులను వైఎస్సార్ సీపీ నాయకులు దహనం చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వెలిదండి గోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కటకం చిన్న వెంకటయ్య, కటిల బుచ్చిబాబు, ఊరు బండి మనయ్య, ఉన్నాం పెద్దబ్బాయి, కటకం గోపాల్, శెట్టిపల్లి కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.
- విజయపురిసౌత్‌లో ఎంపీపీ బూడిద శ్రీను ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. వైస్ ఎంపీపీ పోతిరెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్‌లు కేతవత్ శ్రీనునాయక్, జయప్రకాష్‌రెడ్డి(చిన్నా), దేవదానం, పెదమంత్రూ నాయక్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తోటకూర పరమేశ్వరరావు పాల్గొన్నారు.



వైద్య 'జ్యోతి'

గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) ఏపీ చాప్టర్ రాష్ట్రస్థాయి వార్షిక తొలి సమావేశం శుక్రవారం జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి విడదల రజిని, ఆరోగ్యశ్రీ సీఈఓ హరీంద్రప్రసాద్, నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, మేయర్ మనోహర్, సూపరింటెండెంట్ ప్రభావతిని చిత్రంలో చూడొచ్చు.

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద బ్యాంకు డీసీసీబీ

టర్నోవర్ రూ.5,442.28 కోట్లు

- పీఏసీఎస్‌లలో రికవరీల వేగం పెంచాలి
- బ్యాంక్ లాభాల్లో పీఏసీఎస్‌లకు 6 శాతం డివిడెండ్
- జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం ద్వారా విదేశీ విద్యకు రుణాలు
- ప్రతి రైతుకూ పంట రుణం ఇవ్వాలి
- జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

కొరిటిపాడు(గుంటూరు): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రూ.5,442.28 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో రెండో అతి పెద్ద బ్యాంకుగా వృద్ధి చెందిందని ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో తీసుకున్న రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని కోరారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన బ్యాంక్ మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ పాలకవర్గం, అధికారుల సమష్టి కృషితో 2022–23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.36 కోట్లు లాభాలు సాధించినట్టు వివరించారు. లాభాల నుంచి ఆరు శాతం డివిడెండ్‌ను అన్ని సహకార సంఘాలకు పంచనున్నట్లు వెల్లడించారు. జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం ద్వారా విదేశీ విద్యకు పెద్ద ఎత్తున రుణాలు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 78 మంది విద్యార్థులకు విదేశీ విద్య కోసం రుణాలు అందజేసినట్టు వివరించారు. ప్రతి రైతుకూ పంట రుణం ఇవ్వాలన్నారు. సొసైటీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.50 వేలు ఉచితంగా కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 పీఏసీఎస్‌ల అధ్యక్షులు ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేసుకోవాలని సూచించారు. ముందుగా జీడీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి పలు తీర్మానాలు సభలో పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మహాజన సభ సమావేశంలో బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై

రేపు ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు
- ప్రామాణిక స్టడీ మెటీరియల్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1000 వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (sakshieducation.com)రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్‌సీ ఎగ్జామ్స్ కలిసి జూలై 2వ తేదీ (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గుంటూరు మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఎదుట ఉన్న శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్నేళ్లుగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్–2 ఉద్యోగాలు రానుండటం, దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 89850 94499 సెల్ నంబర్‌కు తమపేరు, సెల్ నంబరు, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ:
జూలై 2, 2023 (ఆదివారం)

వేదిక:
శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరం, హిందూ కళాశాల ఎదురు, మార్కెట్ సెంటర్, గుంటూరు

సమయం:
ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్ : 89850 94499

నూతన స్టేషన్లకు రైళ్ల కేటాయింపు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో పలు రైల్వే స్టేషన్‌ల మీదుగా రైళ్లను కేటాయించడం జరిగిందని గుంటూరు రైల్వే డీఆర్ ఎం ఎం.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తిరుపతి–లింగంపల్లి(12733) ఎక్స్‌ప్రెస్ మిరియాల గూడ స్టేషన్ మీదుగా, భువనేశ్వర్ –సికింద్రబాద్ విశాఖ(17015) ఎక్స్‌ప్రెస్ మిరియాలగూడ, నల్గొండ స్టేషన్‌ల మీదుగా, చెన్నై సెంట్రల్–హైదరాబాద్(12603)ఎక్స్ ప్రెస్ మిరియాల గూడ, నల్గొండ స్టేషన్‌ల మీదుగా.. నరసాపూర్–లింగంపల్లి(17255) ఎక్స్‌ప్రెస్ నల్గొండ స్టేషన్ మీదుగా, లింగంపల్లి–నరసాపూర్(17256) ఎక్స్‌ప్రెస్ మంగళగిరి స్టేషన్ మీదుగా, ధర్మవరం–మచలిపట్నం(17216) ఎక్స్‌ప్రెస్ గిద్దలూరు, మార్కాపూర్ రోడ్డు మీదుగా, చంగలపట్టు–కాకినాడ(17643) పోర్ట్ సర్కిల్ ఎక్స్‌ప్రెస్ న్యూ గుంటూరు స్టేషన్, మంగళగిరి స్టేషన్‌ల మీదుగా జులై 5వ తేదీ నుంచి ప్రత్యేకంగా ప్రయాణికుల సౌకర్యార్థం నడుస్తాయని తెలిపారు. అదే విధంగా యశ్వంతపూర్– మచలిపట్నం(17212) కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు కంభం మీదుగా జులై 6 నుంచి, నగర్‌సోల్–నరసాపూర్(17232) ఎక్స్‌ప్రెస్ రైలు నల్గొండ, మిరియాల గూడ స్టేషన్‌ల మీదుగా జులై 8 నుంచి కేటాయిస్తున్నట్లు తెలిపారు.

పింఛన్లు వంద శాతం పంపిణీ చేయాలి

కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఒకటో తేదీ మధ్యాహ్నం నాటికి 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారుల్ని కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బాలునాయక్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆదేశించారు. జిల్లాలో జులై ఒకటి నుంచి అర్హత కలిగిన పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం 2,67,540 పింఛన్లు పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. తెల్లవారుజామునే ఐదు గంటల నుంచే ఇంటికి వెళ్లి నగదు పంపిణీ చేయాలని వలంటీర్లను ఆదేశించారు.

క్రికెట్ మహిళా జిల్లా జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సెంట్రల్ జోన్ 2023–24 సీజన్ మహిళా క్రికెట్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే సీనియర్, అండర్–19, అండర్–15 జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ అడహక్ కమిటీ చైర్మన్ టి.త్రినాథరాజు తెలిపారు. సీనియర్ మహిళా జట్టుకు కె.ఇ.డయానా (కెప్టెన్), పి.రంగలక్ష్మి (వైస్ కెప్టెన్), కె.దాత్రి, ఎం.భావన, టి.నివేదిత, ఎస్.కె.నిఖిత, ఎ.రోహిణి, పి.శ్రీజ, ఎండీ ముస్కాన్, ఎం.లేఖన, కె.వర్ధిని, ఎం.పూజిత, ఎం.అంజుమ్, బి.పుష్ప, ఎ.ఆశ, అండర్–19 జట్టుకు పి.రంగలక్ష్మి (కెప్టెన్), కె.వర్ధిని, పర్గిత, ఎం.లేఖన, ఎండీ జాష్‌మెహక్, కె.కీర్తి, బి.పుష్ప, ఎం.అంజుమ్, సి.హెచ్.గౌతమి, ఎస్.కె.నిఖిత, ఎం.గీతాంజలి, ఐ.చందన, వి.గాయత్రి, టి.నాగచంద్రిక, ఎం.సుజన, అండర్–15 జట్టుకు పి.లక్ష్మీఅపర్ణ (కెప్టెన్), ఎం.లక్షణ్య (వైస్ కెప్టెన్), బి.చైత్ర, ఆర్.ఇషికామయి, బి.తన్వీసాయి, ఆర్.రోహిణి, ఎస్‌డి ఉజ్మా, టి.గుణచంద్రిక, స్రవంతి, సి.హెచ్.ధనశ్రీ, ఆర్.చైతన్యప్రియ, కె.సౌఖ్య, జె.యసశ్విని, తేజస్విని, ఆర్.మానసయశోధ ఎంపికైనట్లు తెలిపారు.

వైద్య వైభోగమే



నరసరావుపేట ఏరియా వైద్యశాలలో ఔట్ పేషెంట్లు

- 400 పడకల జిల్లా వైద్యశాలగా ఏరియా ఆస్పత్రి
- రూ.57 కోట్లు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- వైద్యశాల పక్కనే ఉన్న స్థలంలో విస్తరణ పనులు
- వినుకొండ, నాదెండ్ల, మాచర్ల, చిలకలూరిపేట ఆస్పత్రులూ అప్‌గ్రేడ్



లింగంగుంట్లలో ఏరియా వైద్యశాల

నరసరావుపేట: స్థానిక లింగంగుంట్లలోని 200 పడకల డాక్టర్ వైఎస్సార్ ఏరియా వైద్యశాల త్వరలో 400 పడకల జిల్లా ప్రభుత్వ వైద్యశాలగా రూపుదిద్దుకోనుంది. తన పరిపాలనలో వైద్యంపై అత్యధిక శ్రద్ధ చూపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ మేరకు అవసరమైన మౌలిక వసతుకల కల్పన కోసం రూ.57 కోట్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీని వల్ల జిల్లాలోని 26 లక్షల మంది ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. వినుకొండలోని 30 పడకల ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలుగానూ, నాదెండ్ల మండలం కనపర్రులోని పీహెచ్‌సీని సీహెచ్‌సీగానూ అప్‌గ్రేడ్ చేయనున్నారు. మాచర్లలో ప్రత్యేక బ్లడ్‌బ్యాంకు, వినుకొండ, చిలకలూరిపేటల్లో ట్రామాకేర్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు.

గత ప్రభుత్వ హయాంలో వసతులు కల్పించకుండానే ప్రారంభం

గతంలో కాంగ్రెస్ హయాంలో నరసరావుపేట ఏరియా వైద్యశాల నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని నాబార్డు సంస్థ మొత్తం రూ.72 కోట్లతో మూడు దశలుగా నిర్మాణానికి నిధులు కేటాయించింది. మొదటి దశగా రూ.21కోట్లు విడుదల చేసింది. వైద్యశాల నిర్మాణం కోసం లింగంగుంట్ల కాలనీలోని ఎన్‌ఎస్పీ ఆధీనంలోని 4.5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రెండెకరాల స్థలంలో ఏరియా హాస్పిటల్ నిర్మాణం చేపట్టి రూ.21కోట్లలో రూ.15కోట్లు ఖర్చుచేసి భవన నిర్మాణం వరకు పూర్తిచేసింది. 2019లో ఎన్నికల కోడ్ రావడంతో ఎటువంటి మౌలిక వసతులూ కల్పించకుండానే హడావుడిగా ప్రారంభోత్సవం చేసింది.

సామర్థ్యానికి మించి..

ప్రస్తుతం 25 మంది డాక్టర్లు, 15 మంది పీజీ స్టూడెంట్లు, 24 మంది నర్సుల పర్యవేక్షణలో 250 మంది ఇన్‌పేషెంట్లు ఇక్కడ వైద్యసేవలు పొందుతున్నారు. రోజూ వైద్యసేవలు పొందేందుకు 1500 మంది ఇన్‌పేషెంట్లు వస్తున్నారు. 250 రక్తపరీక్షలు ఒకేసారి చేసే ల్యాబ్‌తోపాటు 10 బెడ్లతో ఐసీయూ యూనిట్ ఏర్పాటు చేశారు. మూడో ఫ్లోర్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్ పూర్తి కావొచ్చింది.

మిగిలిన 2.5ఎకరాల్లో విస్తరణ

ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందజేసేందుకు మిగిలిన 2.5 ఎకరాల స్థలంలో మరో 200 పడకలకు ఆస్పత్రిని విస్తరించి జిల్లా వైద్యశాలగా ఏర్పాటుచేయాలంటూ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్, వైద్యశాల సూపరింటెండెంట్ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై సీఎం పేషీ నుంచి ఏరియా వైద్యశాలను 400 పడకల జిల్లా వైద్యశాలగా రూపుదిద్దేందుకు రూ.57 కోట్లకు అష్యూరెన్స్ ఇస్తూ ఉత్తర్వులను విడుదల చేశారు. దీనిపై జిల్లా హెల్త్ విభాగ ఇంజినీరింగ్ అధికారులు స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డితో కలిసి హాస్పిటల్ పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. నిర్మాణాలు పూర్తయితే గుంటూరు జీజీహెచ్ స్థాయిలో జిల్లా కేంద్రంలో పల్నాడు ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందజేసేందుకు ఒక బ్రహ్మాండమైన హాస్పిటల్ రూపుదిద్దుకోనుంది.

సకల వసతులూ కల్పించిన గోపిరెడ్డి



డాక్టర్లతో ఉత్తర్వులపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఒక డాక్టర్‌గా ఆలోచించి నరసరావుపేట ఆస్పత్రి భవనాన్ని వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని భావించారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి కోరికపై అప్పటి వైద్యశాఖ మంత్రి ఆళ్లనాని వైద్యశాలను సందర్శించారు. ర్యాంపు, లిఫ్ట్, తాగునీరు, బెడ్లు, ఆక్సిజన్, విద్యుత్ సదుపాయం, ఎస్టీపీ, ప్రహరీ తదితర సౌకర్యాలకోసం రూ.3.5కోట్లు విడుదల చేశారు. మరో రూ.50 లక్షల విలువైన వైద్యపరికరాలను దాతల నుంచి సేకరించారు. దీంతో పనులు మొదలై పూర్తి కాగానే కోవిడ్ సంక్షోభం తలెత్తింది. మొదటి, రెండో వేవ్‌ల ద్వారా ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు ఐదువేల మంది కరోనా పేషెంట్లకు ఇక్కడ వైద్యసేవలు అందజేశారు. 2022లో వైద్యశాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. మాతా, శిశు విభాగం మినహా పల్నాడు రోడ్డులోని పాత 100పడకల వైద్యశాలలోని అన్ని విభాగాలనూ ఈ 200 పడకల వైద్యశాలకు మార్చారు.

4న వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

విజయవంతం చేయాలని మంత్రి అంబటి పిలుపు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి, కాపు నాయకులు

నరసరావుపేట: సత్తెనపల్లి పట్టణంలో ఈనెల 4న నిర్వహించే దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణకు కాపులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కోరారు. కార్యక్రమానికి నరసరావుపేట నియోజకవర్గంలోని కాపుల్ని సమాయత్తం చేసేందుకు శుక్రవారం బరంపేటలోని కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి రామిశెట్టి కొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రంగా విగ్రహావిష్కరణ రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తాను మొదటి నుంచి రంగా అభిమానిగానే ఉన్నానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో వైఎస్సార్ కుటుంబానికి ఆప్తమిత్రుడిగా ఉన్న నన్ను ఆయన ఎంతో అభిమానంగా ఆదరించారని తెలిపారు. మహానేత మరణానంతరం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచానని, ఆ పార్టీ సైన్యానికి సారథిని చేశారని వివరించారు. రంగాను హత్యచేసింది చంద్రబాబేనని ఆయన ఆరోపించారు. తనను కూడా చంపేందుకు ప్రయత్నించాడని ఒక ప్రధాన చానల్ ఇంటర్వ్యూలో చెప్పుకున్న కన్నా లక్ష్మీనారాయణ ఇప్పుడు అదే చంద్రబాబుతో అంటకాగుతూ ఆయనకు పాలాభిషేకం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. దీన్ని బట్టి ఎవరు నిజాయతీపరులో, ఎవరిని నమ్మవచ్చో కాపులు అర్థం చేసుకోవాలని తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గంలోని అనేక గ్రామాలకు చెందిన కాపులకు నరసరావుపేట నియోజకవర్గంతో చుట్టరికం, ఆత్మీయ అనుబంధాలు ఉన్నాయని, వారంతా రంగా విగ్రహావిష్కరణలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంబటి కోరారు. వచ్చే ఎన్నికల్లో తన విజయానికి సహకారం అందజేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాపు నాయకులు పక్కాల సూరిబాబు, ఎన్కే ఆంజనేయులు, ఎడ్యుకేర్ ఏలూరి ప్రసాద్, తోట నరసింహారావు, ఢిల్లీ నాయుడు పాల్గొన్నారు.

ఆంధ్ర సెంట్రల్ జోన్‌లో ప్రకాశం జట్టు విజయ యాత్ర

- రెండో మ్యాచ్‌లోనూ పైచేయి
- సెంచరీలు నమోదు చేసిన రెండు జట్ల బ్యాట్స్‌మెన్లు



కె.సాత్విక్, ప్రకాశం (124 పరుగులు)



కె.కె.సూర్యనాగ్, కృష్ణా (103 పరుగులు)

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్–19 బాలుర ఆంధ్ర సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంటులో ప్రకాశం జిల్లా జట్టు విజయయాత్ర కొనసాగిస్తోంది. టోర్నమెంటులో భాగంగా శుక్రవారం ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో ప్రకాశం జిల్లా జట్టు 133 పరుగుల భారీ తేడాతో పశ్చిమ గోదావరి జట్టుపై విజయం సాధించింది. ప్రకాశం జిల్లా జట్టు బ్యాట్స్‌మన్ కె.సాత్విక్ 88 బంతుల్లో 124 పరుగులు సాధించి విజయాన్ని ఖరారు చేశాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న ప్రకాశం జట్టు నిర్ణీత 50 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 360 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టులోని సాత్విక్ 124, కె.ఆనంద్ 43, జి.గురుపార్థసారథి 35 పరుగులు సాధించారు. పశ్చిమ గోదావరి జట్టు బౌలర్లు సాయిసుమంత్, సాయితేజకు చెరో రెండు వికెట్లు, హర్ష, జస్విన్‌కు చెరో వికెట్ లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జట్టు లక్ష్య సాధనలో చతికిల పడింది. జట్టు బాట్స్‌మన్ కె.కె.సూర్యనాగ్ (114 బంతుల్లో 103 పరుగులు) ఒంటరి పోరాటం ఫలించలేదు. మరో బ్యాట్స్‌మన్ కె.రేవంత్ 42 పరుగులు సాధించాడు. ప్రకాశం బౌలర్లు ఇర్ఫాన్, గురుపార్థసారథి చెరో రెండు వికెట్లు సాధించగా, ప్రణవ్, దుర్గాబాలాజీలకు చెరో వికెట్ లభించాయి. పోటీల్ని ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు. శనివారం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు తలపడనున్నాయి.

కుమార్తెను కాలేజీలో దింపి.. కానరాని లోకాలకు



కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటనపై పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు... ఘంటసాల మండలం కొడాలి గ్రామానికి చెందిన తుమ్మల శ్రీనివాసరావు (46)కు వివాహమై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రెండో కుమార్తె కీర్తన నిడమానూరు గ్రామంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కుమార్తెను కళాశాలలో దింపేందుకు బైక్‌పై శుక్రవారం ఉదయం కళాశాలకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో నెప్పల్లి మసీదు సమీపంలో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి మార్జిన్‌లో ఆపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనటంతో తీవ్ర గాయాలపాలై శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. తన సోదరుడు మృతికి లారీ నిర్లక్ష్యంగా పార్కింగ్ చేయటమే కారణమంటూ మృతుడి సోదరుడు తుమ్మల వెంకట శివనాగశ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేఈబీ కెనాల్‌కు 400 క్యూసెక్కుల నీరు విడుదల

కె. కొత్తపాలెం(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ముందుగానే సాగు నీరు విడుదల చేసినట్లు విజయవాడ ఇరిగేషన్ శాఖ ఈఈ పీవీఆర్ కృష్ణారావు తెలిపారు. మండల పరిధిలోని కె. కొత్తపాలెం వద్ద కేఈబీ కెనాల్ నుంచి 9వ నెంబర్ కాలువకు 400 క్యూసెక్కుల సాగునీరు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. 2023–24 ఖరీఫ్ సాగుకు దివిసీమలో 1.37 లక్షల ఎకరాలు సాగు చేపట్టినట్లు తెలిపారు. విడతల వారీగా పెంచి సాగునీరు విడుదల చేస్తామని వివరించారు. ఇరిగేషన్ డీఈ రవికిరణ్, ఏఈఈ జనార్ధనరావు, ఏఈలు పి.వెంకటేశ్వరావు, పి.రవితేజ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక వైద్యానికి తలమానికం పల్నాడు

ఆధునిక దంత వైద్యం

ఏపీలోనే కాక, తెలంగాణలో సైతం ప్రపంచ స్థాయి టెక్నాలజీ, అత్యాధునిక పరికరాలతో నొప్పిలేని ఆధునిక దంత వైద్యం మా వైద్యశాల సొంతం. ఏపీ, తెలంగాణాలలో 20కుపైగా బ్రాంచీలలో అతి తక్కువ ఖర్చుతో ఆధునిక పద్ధతిలో ఇంప్లాంట్స్ అమర్చడం సిరి డెంటల్ సొంతం.

డాక్టర్ అనీల, సిరి డెంటల్, పల్నాడురోడ్డు, నరసరావుపేట



నరసరావుపేట: ఆధునిక వైద్యరంగానికి పల్నాడు జిల్లా తలమానికంగా మారింది. ఒకవైపు ప్రభుత్వ హాస్పిటళ్లతో పాటు మరోవైపు ప్రైవేటు హాస్పిటళ్ల ద్వారా పేద, మధ్య తరగతి, ధనిక వర్గాలవారికి అత్యాధునిక సౌకర్యాలతో ఆధునిక వైద్యం లభిస్తోంది. దీంతో పాటు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా ఉచిత వైద్యసేవలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాము అందజేస్తున్న వైద్య సేవలపై డాక్టర్ల అభిప్రాయాలు ...

నిపుణులైన డాక్టర్లతో సేవలు

గత పదిహేనేళ్ల నుంచి పేద, మధ్యతరగతి వారికి 325కు పైగా మెడికల్ క్యాంపులు నిర్వహించి సుమారు 10లక్షల మందికి పైగా రోగులకు ఉచిత వైద్యసేవలు అందజేసి మందులు పంపిణీ చేశాం. మొదటిసారిగా నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ ప్రాంతాల్లో అంజిరెడ్డి హాస్పిటళ్ల ద్వారా నిపుణులైన డాక్టర్లతో కార్డియాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరో సర్జరీ, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్, లాప్రోస్కోపిక్ సర్జరీ, ఈఎన్‌టీ, యూరాలజీ, ఆర్థోపెడిక్, ఫిజియోథెరఫీ సేవల్ని నిర్వహిస్తున్నాం. ఈఆర్‌సీపీ, కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేశామనే చెప్పుకునేందుకు గర్వపడుతున్నాం. 32 ఇన్సూరెన్స్ కంపెనీలతో టైఅప్ చేసుకొని పూర్తి సదుపాయాలతో ఆరోగ్యశ్రీ కల్గిన ఏకైక హాస్పిటల్ తమది. ఎంఆర్ఐ, సిటీస్కాన్, డయాలసిస్ సేవలు ఉన్నాయి.

డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాసరెడ్డి,
మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్,
సత్తెనపల్లి రోడ్డు, నరసరావుపేట

అత్యాధునిక ఎముకలు,కీళ్ల వైద్యం

గత 30 ఏళ్లుగా నరసరావుపేట పట్టణంలో ఎముకలు, కీళ్ల వైద్యంలో ఎంతోమందికి వైద్యసేవలు అందజేసిన హాస్పిటల్ అమూల్యా నర్సింగ్ హోమ్. పల్నాడుతో పాటు ప్రకాశం జిల్లా యర్రగుంటపాలెం, మార్కాపురం, కనిగిరి, మార్టూరు తదితర ప్రాంతాల నుంచి వైద్య సేవల కోసం రోగులు వస్తుంటారు. పోలియా, నరాలకు ఆధునిక చికిత్స, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఇలిజరేవ్ టెక్నిక్ ఆపరేషన్ లాంటి చికిత్సలు చేస్తున్నాం. అధునాతమైన లామినార్, ఎయిర్‌ఫ్లో థియేటర్ సౌకర్యం మా వైద్యశాల సొంతం. అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల హెల్త్ కార్డుల ద్వారా చికిత్స లభిస్తుంది. డాక్టర్ చదలవాడ ఆదిత్య కన్సల్టెంట్ స్పైన్ సర్జన్‌గా వైద్యసేవలు అందజేస్తున్నారు.

డాక్టర్ చదలవాడ అరవిందబాబు,
ఎముకలు, కీళ్లవైద్య నిపుణులు, అమూల్య
నర్సింగ్ హోమ్, నరసరావుపేట



99 శాతం సక్సెస్ రేటు

గత పదేళ్లుగా శ్రీదత్తా హాస్పిటల్ ద్వారా హృద్రోగులతో పాటు డయాబెటాలజీ, న్యూరాలజీ, యూరాలజీ, గైనకాలజీ, పల్మనాలజీ రోగులకు వైద్యసేవలు అందజేస్తున్నాం. గుండె వ్యాధులకు 99 శాతం సక్సెస్ రేటుతో అత్యంత సమర్థ వైద్యసేవలు కల్పిస్తున్నాం. అన్ని ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల సహకారంతో క్యాష్‌లెస్ వైద్యసేవలు అందజేస్తున్నాం. నరసరావుపేటలోనే కాకుండా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ తదితర ప్రాంతాల ప్రజలకు కూడా స్థానికంగానే వైద్యసేవలు కల్పిస్తున్నాం.

డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్,
శ్రీదత్తా సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్,
ప్రకాష్‌నగర్, నరసరావుపేట

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు

ఎముకలు, కీళ్లు, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో వైద్యసేవలు అందజేస్తున్నాం. ఇవేగాక స్త్రీ సంతాన సాఫల్యం, జనరల్, లాప్రోస్కోపిక్, పిల్లల వైద్యం నిపుణులైన డాక్టర్లతో వైద్యసేవలు కల్పిస్తున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కాన్పులు, ఆపరేషన్లు, 24 గంటలు ఎమర్జెన్సీ వైద్యసేవలు తమ వైద్యశాలలో లభిస్తున్నాయి. ఈహెచ్ఎస్, డబ్ల్యూజేహెచ్ఎస్ సభ్యులకు ఉచితంగా కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం. మాతో పాటు డాక్టర్ రామిరెడ్డి సునీతకుమారి, డాక్టర్ ఎం.విశ్వనాథరెడ్డి వైద్యసేవల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.

డాక్టర్ రామిరెడ్డి వినోద్‌కుమార్,
లిఖిత సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్,
కోటసెంటర్, నరసరావుపేట



జీర్ణకోశ వ్యాధులకు ప్రత్యేక వైద్యం

మా హాస్పిటల్‌లో జీర్ణకోశ వ్యాధులు, లివర్, గాల్ బ్లాడర్, ప్రాంకియాసిస్‌లకు వైద్యసేవలు అందజేస్తున్నాం. ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, ఈఆర్‌సీపీ, బ్యాండింగ్, హిమోక్లిప్ సేవలు అందుబాటులో ఉన్నాయి. నాణెలు, పిన్నులు వంటి వాటితో పాటు చేప ముళ్లు, ఎముకలు, అన్నవాహికలో అడ్డుపడితే వాటిని తీయడానికి ప్రత్యేక వైద్య పరికరాలు ఉన్నాయి.

డాక్టర్ యండమూరి నిఖిలేష్, అశ్యూర్ హాస్పిటల్, పల్నాడురోడ్డు, నరసరావుపేట

హెల్త్ స్కీములతో ఉచిత ఆపరేషన్లు

మా హాస్పిటల్ ద్వారా అనుభవజ్ఞులైన డాక్టర్లతో పల్నాడు ప్రాంత ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో వైద్యసేవలు అందజేస్తున్నాం. జనరల్ అండ్ క్రిటికల్‌కేర్, షుగర్, థైరాయిడ్, ఎన్ఐసీయు, చిన్నపిల్లల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీములతో అన్నిరకాల ఆపరేషన్లు ఉచితంగా చేస్తాం. జనరల్, లాప్రోస్కోపిక్ సర్జరీ విభాగం కూడా ఉంది.


డాక్టర్ గడ్డం శ్రీకాంత్‌రెడ్డి, శ్రీకేర్ హాస్పిటల్, వినుకొండ రోడ్డు, నరసరావుపేట



లివర్ వ్యాధులకు అత్యుత్తమ వైద్యం

గ్యాస్ట్రో అండ్ లివర్ వ్యాధులకు అత్యుత్తమ వైద్యసేవలు అందజేస్తున్నాం. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ అండ్ అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీలో అనుభవం. పల్నాడులోని మొట్టమొదటి క్యాప్సూల్ ఎండోస్కోపీ, మలబద్ధకం సమస్యకు పల్నాడులో ఎక్కడాలేని మ్యానో మెట్రిక్ సదుపాయం కలదు. పల్నాడులోని ప్రప్రథమ ఒలంపస్ 190 హెచ్‌పీ, డ్యూయల్ ఫోకస్ ఎండోస్కోపీ, కోలనోస్కోపీ సౌకర్యం కలదు.

డాక్టర్ కంఠమనేని రవీంద్ర, రవీంద్ర గ్యాస్ట్రో లివర్‌కేర్ హాస్పిటల్, పాత పల్నాడు బస్టాండ్, నరసరావుపేట



కేంద్రియ విద్యాలయంలో ఒత్తిడి లేని విద్య

కేవీఎస్ హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్

నాదెండ్ల: కేంద్రియ విద్యాలయంలో ఒత్తిడి లేని నాణ్యమైన విద్య లభిస్తుందని కేవీఎస్- హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమీషనర్ బి.రాజేశ్వరరావు చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రియ విద్యాలయాన్ని అకడమిక్ ప్యానెల్ ఇన్‌స్పెక్షన్ సందర్భంగా సందర్శించారు. క్లాసు రూముల్లో విద్యార్థులకు అందుతున్న విద్య, ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, సదుపాయాలు తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ అకడమిక్ ఇయర్‌లో అడ్మిషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇర్లపాడు గ్రామంలో 10.11 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు పరిశీలించారు. మూడో తరగతి - ఇంటర్మీడియట్ వరకూ రూ.38 కోట్లు వ్యయంతో, మరో రూ.3.20 కోట్లతో క్వార్టర్స్ నిర్మాణం జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పాఠశాలలో 9వ తరగతి నడుస్తోందన్నారు. తుళ్లూరులో కేంద్రియ విద్యాలయంలో ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసినా ఒక దానికి రోడ్డు లేకపోవటం, మరోదానికి సాంకేతిక లోపం కారణంగా నిలిచిపోయిందన్నారు. మాచర్ల, రొంపిచర్ల మండలాల్లో ఈ సంవత్సరంలో గానీ, వచ్చే విద్యా సంవత్సరంలో గానీ అకడమిక్ ఇయర్ ప్రారంభమౌతుందన్నారు. ప్రస్తుతం ఏపీకి అమరావతి రీజియన్ రావల్సి ఉందని, రీజియన్ మంజూరైతే కేంద్రియ విద్యాలయాల నిర్వహణ సౌలభ్యంగా మారుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఆయనతో పాటూ ప్రిన్సిపల్ ఎస్ విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు


నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ ప్రవల్లిక శుక్రవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన అప్పిరెడ్డి వద్ద 2015 సంవత్సరంలో గుంటూరుకు చెందిన గురవయ్య రూ.1.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో నిందితుడికి 6 నెలల జైలు, ఫిర్యాదు దారుడికి రూ.2.50 లక్షలు నష్ట పరిహారం అందజేసేలా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఓటర్ల జాబితా ప్రక్రియపై తహసీల్దార్ సమావేశం

చిలకలూరిపేట: పట్టణంలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం జరిగింది. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలోని ఓటర్ల జాబితా ప్రక్రియపై ఈ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ జి సుజాత, డీటీ ఎస్ రవికుమార్‌ల ఆధ్వర్యంలో జరిగింది.









క్లుప్తంగా

వివాహిత అనుమానాస్పద మృతి


మృతురాలు కోటేశ్వరమ్మ

మార్టూరు: ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈఘటన శుక్రవారం ఉదయం మండలంలోని రాజుపాలెం గ్రామంలో వెలుగు చూసింది. సీఐ ఎస్కే టీ ఫిరోజ్ వివరాల మేరకు.. రాజుపాలెం బీసీ కాలనీకి చెందిన లచ్చబోయిన ప్రసాద్‌కు అద్దంకి మండలం శింగరకొండపాలేనికి చెందిన కోటేశ్వరమ్మ (32)తో సుమారు 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 12 ఏళ్లు, ఏడేళ్ల వయసు గల ఇద్దరు సంతానం. ప్రసాద్ మద్యంతోపాటు ఇతర దుర్వ్యసనాలకు లోనై తరచూ కోటేశ్వరమ్మను శారీరకంగా హింసిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో భర్తతో గొడవపడి మూడు నెలల కిందట పుట్టింటికి వెళ్లిన కోటేశ్వరమ్మను ఐదురోజుల కిందట ప్రసాద్ గ్రామానికి తీసుకువచ్చాడు. గురువారం రాత్రి నిద్రపోయిన కోటేశ్వరమ్మ ఉదయం ఉరివేసుకొని మృతి చెందిందని కుమారుడు ఈశ్వరబాబు బంధువులకు చెప్పటంతో విషయం వెలుగు చూసింది. సమాచారం అందుకున్న సీఐ ఘటనాస్థలికి వెళ్లి ప్రసాద్‌ను విచారించగా చీరెతో తన భార్య ఉరివేసుకొని ఉండగా రాత్రి 11 గంటల సమయంలో చూసి కిందకు దించానని, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించానని చెప్పాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం కోటేశ్వరమ్మ మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

11న ఒంగోలు జాతి పశువుల వేలం

గుంటూరు రూరల్: పశు పరిశోధనా స్థానం లాఫాంలో 80 ఒంగోలు జాతి పశువుల వేలం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు పశుపరిశోధన స్థానం ఇన్‌చార్జ్ డాక్టర్ ముత్తారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పశు పరిశోధన స్థానంలో పలు షరతులతో బహిరంగ వేలంను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం నకళ్లతో.. రూ.2 వేలు ధరావత్తు కార్యాలయంలో 11న ఉదయం 9 గంటలలోపు చెల్లించి, పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వేలంలో పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ కోరారు.

సత్తా చూపిన కర్నూలు జిల్లా ఎడ్లు



యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లె గ్రామంలో ఆత్మానందా అవధూత స్వామి ఆరాధన మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన పాలపళ్ల ఎడ్ల పందేల్లో కర్నూలు జిల్లా మునగాల, గూడూరుకు చెందిన ఎడ్లు 4 వేల అడుగులు బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా వినుకొండ ఏఎంసీ చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, పద్మావతియాదవ్ ఎడ్లు 3517 అడుగులు లాగి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్లు 3507 అడుగులు లాగి తృతీయ స్థానం, సూరేపల్లి, చినగానిపల్లెకు చెందిన ఎడ్లు 2750 అడుగులు లాగి 4వ స్థానం, యర్రగొండపాలెం మండలం గోళ్లవిడిపికి చెందిన కంగటి పుల్లారెడ్డి ఎడ్లు 1750 అడుగులు లాగి 5వ స్థానంలో నిలిచాయని గూడ శ్రీనివాసరావు తెలిపారు.

మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసరావు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావును నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గత మార్కెట్ యార్డు పాలకవర్గం పదవీ కాలం 2023 మే 24వ తేదీ నాటికి ముగిసిందని పేర్కొన్నారు. తదుపరి కొత్త పాలకవర్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

34,259 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు శుక్రవారం 31,118 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,259 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం-334, నంబరు-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.13,000 నుంచి రూ.23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.14,000 నుంచి రూ.24,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 13,978 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్టు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

- జగనన్నకు చెబుదాం అర్జీలు నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- దొంగతనం కేసులను త్వరితగతిన ఛేదించాలి
- నేరాల కట్టడికి గస్తీ వ్యవస్థ పటిష్టం చేయండి
- వర్చువల్ విధానంలో మాట్లాడిన జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జిల్లాలోని పోలీస్ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం పోర్టల్‌లో వచ్చిన ఫిర్యాదులను 24 గంటలలోపు పరిశీలించి పరిష్కరించాలన్నారు. వచ్చిన పిటిషన్‌పై పోలీస్ అధికారి చేసిన దర్యాప్తు రిపోర్టును సబ్ ఇన్‌స్పెక్టర్, ఆ పైస్థాయి అధికారులు పరిశీలించి తదుపరి జిల్లా ప్రధాన కార్యాలయానికి పంపించాలన్నారు. పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో ఫిర్యాదుదారుడ్ని విచారించే సమయంలో తీసిన ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రాపర్టీ నేరాల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేదించడానికి ప్రతి సర్కిల్ పరిధిలో క్రైమ్ పార్టీలు ఉన్నాయన్నారు. వారు పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రవర్తన, కదలికలు అనుమానాస్పదంగా ఉన్న పాత నేరస్తులను విచారించాలన్నారు. ప్రాపర్టీ కేసుల్లో నేరానికి పాల్పడిన ముద్దాయి నుంచి దొంగలించబడిన సొత్తును రికవరీ చేసి బాధితులకు అందజేయాలన్నారు. కేసు నమోదైన వెంటనే జాప్యం వహించకుండా సంబంధిత పోలీసు అధికారి సాక్షులను విచారించి, సాక్షులు ఇచ్చిన వాంగ్మూలం, ఇతర సాక్ష్యాధారాల ఆధారంగా ఆ కేసులోని ముద్దాయిని వెంటనే అరెస్టు చేయాలన్నారు. కేసు నమోదైన వెంటనే వ్యక్తిని అరెస్ట్ చేయాలన్నారు. అప్పుడే ఫిర్యాదుదారుడికి మనపై నమ్మకం పెరుగుతుందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే నేరాలను చాలావరకు తగ్గించగలిగామన్నారు. దీనికి ప్రధాన కారణం పోలీస్ అధికారులు, గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసులు ప్రజలకు, వ్యాపారస్తులకు సీసీ కెమెరాలు యొక్క ఆవశ్యకతను వివరించడమే అన్నారు. దాతల సహకారంతో పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధానమైన కూడలి, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో గస్తీ పటిష్టంగా ఉంటే దొంగతనాలు, ఇతర నేరాలను చాలావరకు కట్టడి చేయవచ్చన్నారు. గస్తీ తిరిగే పోలీస్ సిబ్బంది వాహనాలకు తప్పనిసరిగా సైరన్ ఉండాలన్నారు. సైరన్ వేసుకుంటూ గస్తీ నిర్వహించినప్పుడే ప్రజలకు పోలీసులు ఉన్నారనే భరోసా కలుగుతుందన్నారు. ప్రతి రోజూ గస్తీ నిర్వహించడానికి వెళ్లే పోలీస్ సిబ్బందికి స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బ్రీఫింగ్ చేసి పంపాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో బాపట్ల అడిషనల్ ఎస్పీ పి.మహేష్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు, చీరాల డీఎస్పీ ఎస్.ప్రసాదరావు, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ పి.బాలమురళీకృష్ణ, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళల బ్యాగులే లక్ష్యంగా చోరీలు

- నిందితులైన నలుగురు మహిళల అరెస్టు
- 45 గ్రాముల బంగారు నగలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలుటౌన్: మహిళల బ్యాగులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. గుంటూరులోని నల్లచెరువు ఎరుకలకాలనీకి చెందిన చిరుమామిళ్ల యశోద, చిరుమామిళ్ల అంజమ్మ అక్కాచెల్లెళ్లు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన పులి రమణమ్మ, ఈపూరుపాలేనికి చెందిన కుంజా లక్ష్మి స్నేహితులు. ఈ నలుగురికి గతంలో దొంగతనాలు చేసిన అనుభవం ఉంది. చిరుమామిళ్ల అంజమ్మ కొంతకాలంగా ఒంగోలులోని పాత చేపల మార్కెట్ వద్ద నివాసం ఉంటోంది. వారం రోజుల కిందట వీరంతా ఒంగోలులోని అంజమ్మ ఇంటికి వచ్చారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు తమకు అలవాటైన దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. స్థానిక కూరగాయల మార్కెట్, గాంధీరోడ్డు, ఆర్టీసీ బస్టాండు, మాల్స్‌కు తిరుగుతూ బాగా రద్దీగా ఉన్న సమయంలో మహిళల బ్యాగులలో చోరీ చేస్తూ వరుస దొంగతనాలకు పాల్పడ్డారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఏమరపాటుగా ఉన్న మహిళల చేతిలోని హ్యాండ్ బ్యాగులు, చేతికర్రలు కలిగిన సంచులలోని పర్సులు దొంగిలించి వాటిలోని నగలు, నగదుతో ఉడాయిస్తున్నారు. దీంతో పలువురు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ మలికాగర్గ్, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, ఒంగోలు డీఎస్పీ బి.మరియదాసు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రంగంలోకి ప్రవేశించిన పోలీసు బృందం అన్నికోణాల నుంచి దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కేసులకు సంబంధించి మొత్తం 45 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

అభినందనలు తెలిపిన ఎస్పీ...

వరుస దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న నలుగురు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఒంగోలు వన్‌టౌన్ సీఐ టి.వెంకటేశ్వర్లు, ఎస్సై యు.వి.కృష్ణయ్య, ఏఎస్సై కట్టా సురేష్, హెడ్‌కానిస్టేబుళ్లు షేక్ ఖాజావలి, సాయికృష్ణ, కె.విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎం.అనిల్, కె.రామరాజు తదితరులను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

నిరంతర ప్రక్రియలా.. గృహ నిర్మాణాలు జరగాలి

- వైఎస్సార్ జగనన్న కాలనీలకు నిధుల కొరత లేదు..
- పటిష్ట విధానాలు పాటిస్తే త్వరగా నిర్మాణాలు పూర్తి
- వివిధ శాఖల సమన్వయం తప్పనిసరి
- హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ శా


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ శాఖ ఎండీ లక్ష్మీ శా..

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగాలని హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ శా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, హౌసింగ్ శాఖ జాయింట్ ఎండీ శివప్రసాద్, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో లక్ష్మీ శా గృహ నిర్మాణాలపై దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. బిల్లులను ఎప్పటికప్పుడు నిర్దేశించిన విధానంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి సందిగ్ధతకు తావివ్వకూడదని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఇనుము, నీరు పూర్తిస్థాయిలో నిల్వ ఉంచుకోవాలని చెప్పారు.

సీఆర్డీఏలో నిర్మాణాలకు త్వరలో శంకుస్థాపన: కలెక్టర్

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో 25 జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించిన లబ్ధిదారులు 47 వేల మంది ఉన్నారని వెల్లడించారు. వీరికి కేటాయించిన స్థలాల్లో శంకుస్థాపనలు.. ఈ నెల 8న ప్రారంభిస్తామని చెప్పారు. నిర్మాణాలకంటే ముందు రోడ్ల అనుసంధానం, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. నీటి వసతికి బోర్లు తవ్వించామని, అధిక శాతం లబ్ధిదారులు ఆప్షన్-3 కింద వారి అంగీకారం తెలిపారని చెప్పారు. ఈ మేరకు నిర్మాణానికి ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లతో మాట్లాడామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్, భోజన కారియర్లు వితరణ


విద్యార్థులతో బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం పండుగలా భావించే స్థితి తీసుకువచ్చి, చరిత్రాత్మక విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టిన దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పొన్నూరు మండలం, మామిళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్, పిల్లలకు భోజన కారియర్లను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం, స్మార్ట్ తరగతులను ప్రవేశపెట్టి, విద్యా ప్రమాణాలను పెంచిన జగనన్న నాయకత్వంలో ఉండటం ఈ తరం చిన్నారుల అదృష్టమన్నారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో తమ స్వగ్రామం మామిళ్ళపల్లిలోని పాఠశాల భివృద్ధికి బజరంగ్ ఫౌండేషన్ నుంచి సహాయ సహకారాలను అందించడం జరుగుతోందని తెలిపారు. పాఠశాలకు ప్రింటింగ్ మిషిన్‌తో పాటు, 200 మంది విద్యార్థులకు భోజనం కారియర్లు బజరంగ్ ఫౌండేషన్ తరపున అందించడం జరిగిందని వెల్లడించారు. మామిళ్ళపల్లి సర్పంచ్ జాలాది యానాదిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవో-1 పోస్టుల భర్తీ తగదు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎంఈవో-1 పోస్టులను కామన్ సీనియార్టీపై భర్తీ చేయడం తగదని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె. బసవ లింగారావు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న కేసులు పరిష్కారమయ్యే వరకు నియామక ప్రక్రియ నిలుపుదల చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఆర్జేడీ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ జీవో 154 ప్రకారం కొత్తగా ఇచ్చిన 13 ఎంఈవో పోస్టులను ఏ యాజమాన్యం కింద భర్తీ చేయాలనే స్పష్టత లేదన్నారు. 13 జెడ్పీ డీవైఈవో పోస్టులను డీవైఈవో పోస్టులుగా మార్చారని, డైట్ లెక్చరర్స్ నియామకాలపై సైతం స్పష్టత కొరవడిందన్నారు. ఏడీని కలిసిన వారిలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాలీద్, ఉపాధ్యక్షుడు పి. నాగ శివన్నారాయణ, నాయకులు పి. రమేష్, సత్యనారాయణ మూర్తి, కోటేశ్వరరావు, శ్రీనివాస్ ఉన్నారు.

9న ఉపాధ్యాయుల సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఈనెల 9న గుంటూరులో ఉపాధ్యాయుల సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎం. కళాధర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో జరిగిన ఫ్యాప్టో భాగస్వామ్యపక్ష నాయకుల సమావేశంలో కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ విద్యారంగ పరిరక్షణ కోసం ఏర్పాటు చేస్తున్న సదస్సులో వివిధ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఫ్యాప్టో కార్యవర్గ సభ్యుడు కె. బసవ లింగారావు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీని తక్షణ మే నియమించి, బకాయిలను విడుదల చేయాలని కోరారు. సమావేశంలో ఫ్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ సంపత్‌బాబు, డి. పెదబాబు, నాయకులు జి. వేణుగిరిరాజు, ఎండీ ఖాలీద్, ఎం. శ్రీనివాసరావు, సీహెచ్ ఆదినారాయణ, వి. ప్రసాద్, కె. శ్రీనివాసరావు. జి. వెంకటేశ్వరరావు, ఎం. గురుబ్రహ్మం పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులు అరెస్టు

పట్నంబజారు: వ్యక్తిపై దాడిచేసి నగదు దోచుకుపోయిన సంఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుడంపాడు గ్రామానికి చెందిన లక్కాకుల సుబ్బారావు జూన్ 26న కొల్లిశారదా మార్కెట్‌కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి ఊరు వెళుతున్న సమయంలో శ్రీచైతన్య కాలేజీ వద్ద నలుగురు వ్యక్తులు కారులో నుండి దిగి ఇష్టమొచ్చినట్లు కొట్టి రూ.18 వేలు నగదు లాక్కొని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు నరసరావుపేటకు చెందిన షేక్ సైదావల్లి, నల్లచెరువుకు చెందిన షేక్ గౌస్‌బాషా, షేక్ మొహమ్మద్ ముస్తకిన్, షేక్ మస్తాన్‌వలి నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి నుంచి రూ. 17,500, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

కోర్టుకు వెళ్లిన కాంట్రాక్టర్ల టెండర్లు రద్దు


కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తున్న కౌన్సిలర్లు

తీర్మానించిన మున్సిపల్ కౌన్సిల్

చీరాల: మున్సిపాలిటీలో కొంతమంది కాంట్రాక్టర్లు టెండర్లు దక్కించుకుని పనులు చేయడం లేదు. మరలా రీ టెండర్లు పిలిస్తే మాత్రం వారు కోర్టును ఆశ్రయించి కేసులు వేస్తున్నారు. వారి కారణంగా పట్టణంలో అభివృద్ధి ఆటంకాలు ఏర్పడుతున్నాయి.. కాంట్రాక్టర్లు ఎవరైనా పనులు దక్కించుకుని చేయకుండా కోర్టులను ఆశ్రయిస్తే వారి టెండర్లను రద్దు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. దుడ్డు దేవదానం టెండర్ల వ్యవహారంలో కోర్టును ఆశ్రయించడంతో ఈ అంశంపై చర్చ జరిగింది. కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు పనులు చేయకుండా కోర్టును ఆశ్రయించిన కారణంగా ఒకటో అంశాన్ని రద్దు చేశారు. అలానే ప్రైవేట్ స్కూల్ ప్రైడ్ ఇంటర్నేషనల్ స్కూల్ తాగునీటి సరఫరా చేసే విషయంలో కూడా చర్చ జరిగింది. కౌన్సిలర్ మామిడాల రాములు స్కూల్ యాజమాన్యం సొంత నిధులతో పైప్‌లైన్ నిర్మించుకుంటున్నారని మున్సిపాలిటీ కేవలం మంచినీరు మాత్రమే ఇస్తున్నందున ఆమోదం తెలపాలని కోరారు. ఇందుకు మరో కౌన్సిలర్ సూరగాని లక్ష్మి అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌కు తాగునీటి సరఫరా చేయడం సరికాదని అనడంతో ఈ అంశాన్ని కౌన్సిల్ రద్దు చేసింది. అలానే నవ్య కేబుల్ సంస్థ తమ షాప్ రూంలను మరో మూడేళ్లపాటు గడువు పొడిగించాలని కోరగా అందుకు కౌన్సిలర్ బత్తుల అనిల్ అభ్యంతరం వ్యక్తపరిచారు. లీజు సమయం ముగిసి రెండు నెలలు దాటుతుందని ఇప్పుడు గడువు పొడిగించడం సరికాదన్నారు. దీనికి కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ నవ్య కేబుల్‌లో ప్రస్తుతం ఉన్న పరికరాలు తరలించాలన్నా కనీసం ఐదు నెలలు పడుతుందని ఐదు నెలల సమయంలో ఇవ్వాలని కోరారు. చర్చ తరువాత నవ్య కేబుల్ షాపులను రద్దు చేసి బహిరంగ వేలం వేయాలని తీర్మానించారు. మరో కౌన్సిలర్ మొగిలి దీపికా మాట్లాడుతూ తమ వార్డులో మురుగునీటి సమస్య ఏర్పడుతుందని ఐఎల్‌టీడీ వద్దనుంచి వేస్తున్న పైప్‌లైన్ నిర్మాణానికి సంబంధించిన 16, 17, 18, 19 అంశాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఇది ఒక్క వార్డుకు సంబంధించినది కాదన్నారు.

నాలుగు వార్డుల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కరణం బలరాం సూచన మేరకు పైప్‌లైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. మీ వార్డుకు ఇబ్బంది లేకుండా చూస్తామనడంతో ఈ నాలుగు అంశాలను ఆమోదించారు. మొత్తం 75 అంశాలకుగాను మూడు అంశాలను రద్దు చేయగా మిగిలిన అన్ని అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశానికి మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రారెడ్డి, డీఈ యేసయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిట్టీల కేసులో మహిళకు జైలు శిక్ష

తీర్పు ఇచ్చిన గుంటూరు పీడీఎస్ కోర్టు

బాపట్లటౌన్: చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసిన కేసులో పట్టణానికి చెందిన మహిళకు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుంటూరు పీడీఎస్ కోర్టు న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి శుక్రవారం తీర్పు ఇచ్చారు. వివరాలను జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో వెల్లడించారు. పట్టణానికి చెందిన గరిక నాంచారమ్మ తనకు చీటీ పాటలు నిర్వహించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఉందంటూ దాసరి రామ్మోహన్ మరికొంత మందితో చీటీ పాటలు కట్టించుకుంది. రామ్మోహన్ 2011 నుంచి 2012 వరకు చీటీ పాట డబ్బులు కట్టారు. పాట పూర్తి అయినప్పటికీ ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో విసుగు చెంది 2014 జూలై 10వ తేదీ బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్‌స్పెక్టర్ వై.రామారావు కేసు నమోదుచేశారు. విచారణ జరిపి 60 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి చిట్టీల వ్యాపారి నాంచారమ్మ రూ.1.38 కోట్లు వరకు మోసం చేసినట్లు నిర్ధారించారు. అనంతరం కేసు విచారణ కొనసాగించిన బాపట్ల పట్టణ సీఐ పి.వి.ఆంజనేయులు ఈ కేసులో ఏ-1 గరిక నాంచారమ్మ, ఏ-2 గరిక చంద్రయ్య (మృతి), ఏ-3 గరిక బాలు అలియాస్ నాగేశ్వరరావు, ఏ-4 గరిక రవిశంకర్, ఏ-5 కట్టా సాంబశివరావులను నిందితులుగా నిర్ధారించి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 2022 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేసు విచారణకు షెడ్యూల్ విడుదల చేయగా బాపట్ల జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు టౌన్ సీఐ పి. కృష్ణయ్య ఎప్పటికప్పుడు హెడ్ కానిస్టేబుల్స్ కె.శ్రీనివాసరావు, వై.ప్రసాదు ద్వారా సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పెట్టారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పు వెల్లడించింది. సకాలంలో శిక్షపడేలా చేసిన పట్టణ సీఐ, సిబ్బందిని ఎస్పీ వకుల్‌జిందాల్ అభినందించారు.

పురుగుమందుల డీలర్లకు లైసెన్స్‌లు తప్పనిసరి


జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

పర్చూరు (చినగంజాం): ఎరువులు, పురుగు మందులు అమ్మే డీలర్లకు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. పర్చూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు డీలర్లతో ఏడీఏ మోహనరావు అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అబ్దుల్ సత్తార్ డీలర్‌లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి డీలర్ లైసెన్స్ కలిగి ఉండాలని, లైసెన్స్ లేకుండా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్మడం నేరమన్నారు. ప్రతి షాపులో లైసెన్స్ కనబడే విధంగా వివిధ రేట్లను బ్లాక్ బోర్డు మీద రాయాలని సూచించారు. డీలర్లందరూ కంపెనీల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని, సర్టిఫికెట్‌లు ఉంటేనే అమ్మకం చేయాలన్నారు. ఎమ్మార్పీకి మించి అమ్మితే డీలర్‌ల మీద కఠిన చర్యలు తీసుకుంటామని, లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ డీలర్లు విధిగా స్టాక్ వివరాలను రిపోర్ట్ ఇవ్వాలని, ఫారం సమర్పించిన తరువాతే ఎరువులు అమ్మాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో తిరుమలరావు కోటయ్య, మండల వ్యవసాయాధికారులు వేణుగోపాల్, రామ్మోహన్ రెడ్డి, సుధీర్‌బాబు, సమర్‌నాథ్ పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్

- అత్యవసర వైద్య సేవలకు తొలి ప్రాధాన్యం
- ఆరోగ్యశ్రీ చికిత్సలు పెంచేలా చర్యలు


డాక్టర్ కిరణ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న డాక్టర్ ప్రభావతి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం విధుల్లో చేరారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి పదవి విరమణ చేయడంతో డాక్టర్ కిరణ్‌కుమార్‌ను ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ ప్రభావతి నుంచి డాక్టర్ కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన జనరల్ సర్జన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విజయవాడ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి, తనదైన ముద్ర వేశారు.

అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యం

జీజీహెచ్‌లో సత్వర వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు అధిక సంఖ్యలో జరిగేలా చూసి, ఆసుపత్రి అభివృద్ధికి వనరులు సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో గుండెకు బైపాస్ సర్జరీలు జీజీహెచ్‌లో చేసేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జీజీహెచ్‌లో తొలిసారిగా లివర్ ఆపరేషన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు జారీచేసిందని, త్వరలోనే ఆపరేషన్లు జరిగేలా చూస్తామన్నారు. తనపై నమ్మకంతో సూపరింటెండెంట్ పదవి అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సహస్రలో కీహోల్ సర్జరీలు

గుంటూరు మెడికల్: శరీరంలోని కీలు, జాయింట్‌లో ఉన్న సమస్యలను కీహోల్ సర్జరీ ద్వారా గుర్తించి సరిచేయవచ్చని సహస్ర ఆర్థో అండ్ న్యూరో సెంటర్ అధినేత డాక్టర్ మామిళ్లపల్లి శివకుమార్ అన్నారు. మోకాలు, భుజం, తుంటి, మోచేయి, మణికట్టు, గిలక వంటి అన్ని కీళ్లలోని సమస్యలను కోత, కుట్లు లేని కీహోల్ సర్జరీ ద్వారా పరిష్కరించవచ్చు అన్నారు. కీహోల్ సర్జరీ వలన అతి తక్కువ సమయం లో నే తిరిగి సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కీ హోల్ సర్జరీ వల్ల రక్తం పోవడం ఉండదని, పెద్ద గాటు ఉండదని, కట్టు ఉండదన్నారు. మోకాలులో లిగమెంట్స్ తెగిపోయిన, మేనిస్కస్ చినిగిన కీహోల్ సర్జరీ ద్వారా వాటిని రిపేర్ చేయవచ్చును. భుజం కండరాలు తెగినా, కండరాలు బిగుసుకుపోయిన, గూడు మళ్ళీ మళ్ళీ జారుతున్నా అతి చిన్న కీహోల్ సర్జరీ తో రిపేర్ చేయడమే కాకుండా అతి త్వరగా మామూలు పనులు అన్ని చేసుకునేలాగా చేయవచ్చన్నారు. ఈ కీహోల్ సర్జరీ లేదా ఆర్థ్రోస్కోపీ విధానం, భారతదేశం లో సుమారు గత 15 సంవత్సరాల నుంచి బాగా ప్రాచుర్యంలో ఉందని చెప్పారు. మన రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా ఈ విధానాన్ని 2011లో గుంటూరులోని తమ ఆసుపత్రిలో అందుబాటులోకి తెచ్చామన్నారు. గత 12 సంవత్సరాలలో ఆరు వేలకు పైగా కీహోల్ జాయింట్ సర్జరీలు చేసి, నూరు శాతం సక్సెస్ రేట్ సాధించి, ప్రముఖ క్రికెటర్ సునీల్ గవాస్కర్ చేతులమీదుగా గ్లోబల్ హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నామని వెల్లడించారు. పేదలకు ఆరోగ్యశ్రీ లో ఈ అత్యాధునిక సర్జరీని పూర్తి ఉచితంగా చేస్తున్నామన్నారు.